క్లుప్తంగా

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. బుధవారం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై అకాడమీకి చెందిన గురువులు చింతా వెంకట శివరామకృష్ణ కుమార్ సారథ్యంలో 15 మంది కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం ఆలయ ప్రాంగణానికి చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. ఆలయ డీఈవో రత్నరాజు శిష్య బృందాన్ని అభినందించి దేవస్థానం తరపున అమ్మవారి ప్రసాదాలు, ప్రశంసా పత్రాలను అందించారు.

పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ క్యాలెండర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ వ్యాగన్ వర్క్‌షాప్ గుంటుపల్లి వారు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం గొల్లపూడిలో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి షేక్ చాంద్ బాషా మాట్లాడుతూ పెన్షన్ అదాలత్‌లో ఇటీవల సీడబ్ల్యూఎం అంగీకరించిన సమస్యలకు త్వరలో పరిష్కారం లభించనుందని తెలిపారు. వ్యాగన్ వర్క్‌షాప్ సబ్ డివిజనల్ ఆసుపత్రి లోకల్ పర్చేజి మందుల విషయంలో స్థానిక డాక్టర్‌తో మాట్లాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ డెప్యూటీ సీఎంఈ ఎ.రామకృష్ణ, చైర్మన్ వీరాస్వామి, ట్రెజరర్ ఎం.శ్యాంబాబు, ఆఫీస్ బేరర్స్ కృష్ణారావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ మంత్రిని కలిసిన ఏపీ పీటీడీ బీసీ నేతలు



బస్టాండ్(విజయవాడపశ్చిమ): ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు ఆధ్వర్యంలో నేతలు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌ను, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలను మర్యాద పూర్వకంగా కలసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఆర్టీసీని విలీనం చేసిన తర్వాత రద్దు చేసిన బీసీ ఉద్యోగుల గ్రీవెన్స్ జాయింట్ మీటింగ్‌లను పునరుద్ధరించాల్సిందిగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌కి వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రేపు మంత్రి లోకేష్ పాయకాపురం రాక

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 4వ తేదీ శనివారం పాయకాపురం రాధానగర్లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి రానున్నారు. ప్రభుత్వం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించేందుకు మంత్రి లోకేష్ వస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ కృతికశుక్లా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమా, కలెక్టర్ జి.లక్ష్మీశ, కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొంటారు.





ఇంద్రకీలాద్రి నుంచి అరణ్యానికి..!

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కోతుల బెడద ఎక్కువైంది. వానరాల బెడద నుంచి భక్తులను రక్షించేందుకు దేవస్థానం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత ఏడాది సెప్టెంబర్‌లో బుడమేరు ముంపు సమయంలో విజయవాడ రూరల్ పరిధిలోని అంబాపురం, నైనవరం కొండ ప్రాంతాలలోని కోతులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చేశాయి. తొలినాళ్లలో పదుల సంఖ్యలో ఉన్న కోతులు ఇప్పుడు వందల సంఖ్యలోకి చేరాయి. ఆలయ ప్రాంగణంలోని కేబుల్స్‌ను కొరికి వేయడం, ప్రసాదాల కౌంటర్లు, టికెట్ల కౌంటర్లలోని సామగ్రిని చిందర వందర చేయడం, కంప్యూటర్లను ధ్వంసం చేయడం వంటి పనులు చేస్తూ ఆలయ ఉద్యోగులకు కొరకరాని కొయ్యలా తయారయ్యాయి. మరో వైపున అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుల వద్ద నుంచి ప్రసాదాలు, కొబ్బరి చిప్పలను లాక్కుని వెళ్లిపోతుండటం, ఆలయంలోని చెత్త డబ్బాలను చిందర వందర చేయడం చేస్తున్నాయి. దీంతో కోతులను పట్టుకునేందుకు దేవస్థానం ఆలయ ప్రాంగణంలో కొండముచ్చుల ఫొటోలను సైతం ఏర్పాటు చేసింది. అయినా సరే ప్రయోజనం లేకపోవడంతో కోతులను పట్టేవారిని ఏర్పాటు చేసింది. దీంతో ఆలయ ప్రాంగణంతో పాటు ఘాట్‌రోడ్డులోని పలు చోట్ల బోనులు ఏర్పాటు చేశారు. బోనులోకి వచ్చిన కోతులను తిరిగి అంబాపురం, నైనవరం కొండ ప్రాంతాలతో పాటు జక్కంపూడి అడవి ప్రాంతాలలో విడిచి పెడుతున్నారు. ఆలయ ప్రాంగణంలోని కోతులను పట్టుకోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

–ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

శానిటేషన్, ప్రొటోకాల్ దర్శనాలపై పర్యవేక్షణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి ఆలయ పరిసరాలతో పాటు ఘాట్‌రోడ్డు, స్నాన ఘాట్, కనకదుర్గనగర్, మహా మండపం పరిసరాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రొటోకాల్ దర్శనాలపై పర్యవేక్షణ ఉండాలని దుర్గగుడి ఇన్‌చార్జి ఈవో రామచంద్ర మోహన్ అన్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరించిన మోహన్ గురువారం ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఈఈలు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ వ్యవహారాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో మోహన్ మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో శానిటేషన్ మరింత మెరుగ్గా ఉండాలని ఆదేశించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే ప్రముఖుల ప్రొటోకాల్‌తో పాటు సామాన్య భక్తులకు అదే రీతిలో దర్శనం కలిగేలా చూడాలని సూచించారు. క్యూలైన్‌లో గంటల తరబడి భక్తులు వేచి ఉండకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై ఆలోచించాలన్నారు. ఆలయంలో అభివృద్ధి పనులపై సైతం చర్చ జరిగింది. సమావేశంలో ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు, ఏఈవోలు చంద్రశేఖర్, జంగం శ్రీనివాసరావుతో పాటు ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా జరగాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో వీఎంసీ నిర్వహణలో ఉన్న మరుగుదొడ్లలన్ని సక్రమంగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా పటమట, బందర్ రోడ్డు, వారధి, నేషనల్ హైవే, లబ్బీపేట వాటర్ ట్యాంక్, ఆర్టీసీ లేబర్ కాలనీ, నైజాం గేట్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. లబ్బీపేటలోని వాటర్ ట్యాంక్, గవర్నర్ పేటలో ఉన్న మరుగుదొడ్లను కమిషనర్ పరిశీలించి, అవన్నీ నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, వాటిలో నిరంతరం నీటి సరఫరా జరగాలని చెప్పారు. నగర పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, అధికారులందరూ పర్యవేక్షిస్తూ చెత్త సేకరణ నిత్యం జరిగేటట్టు చూసుకోవాలని ఆదేశించారు.



లబ్బీపేటలోని మరుగుదొడ్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

పచ్చదనాన్ని పెంపొందించాలి..

44వ డివిజన్‌లో, ఆర్టీసీ లేబర్ కాలనీలోని అవుట్ ఫాల్ డ్రైయిన్‌ను పరిశీలించి అక్కడ నిర్మాణంలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన 55వ డివిజన్‌లోని నైజాం గేటు వద్ద ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలించి రైల్వే సమన్వయంతో వెంటనే అవుట్‌ఫాల్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. విశాలాంధ్ర రోడ్డులో ఉన్న సెంట్రల్ డివైడర్ పరిశీలించి నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రదేశంలో డివైడర్ ఎత్తును పెంచాలని, డివైడర్‌పై పచ్చదనం మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణంలోని కాలుష్య శాతాన్ని తగ్గించే విధంగా, అవకాశం ఉన్న ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలని, నగర ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో పునీతులు కావాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ మన్నా చర్చి పాస్టర్ చందోలు మోషే ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ అంబాపురంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. దైవజనులు చందోలు మోషే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ప్రతి కుటుంబం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని, ఇంటింటా ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఎమ్మెస్సార్ డెవలపర్స్ అధినేత మాధవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సందర్భంగా పేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాలకోటయ్య, మన్నా చర్చి సంఘ పెద్దలు చందోలు శ్రీనివాస్, రైల్వే మధు, కారె శ్రీనివాస్, ఎస్.సురేష్, పాముల బద్రి, ప్రభాకర్, సంఘస్తులు, మన్నా చర్చి యూత్ పాల్గొన్నారు.

వీఎంసీలో నూతన సంవత్సర వేడుకలు



కమిషనర్ ధ్యానచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న అసోసియేషన్, యూనియన్ సభ్యులు



మేయర్ భాగ్యలక్ష్మికి పూల మొక్క అందజేస్తున్న సీఈ శ్రీధర్‌రెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మినిస్టీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర చాంబర్‌లో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథులుగా హాజరైన కమిషనర్ ధ్యానచంద్ర, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కేక్ కట్ చేసి అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ఉద్యోగులు, సిబ్బంది సమస్యలన్నీ పరిష్కారం కావాలని ఆకాంక్షించారు. తన పరిధిలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దారా సాంబయ్య, ఎస్వీఎస్ చలం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, ఉపాధ్యక్షులు టీవీఎస్ఎన్ మురళీకృష్ణ, వరప్రసాద్, సహాయ కార్యదర్శి టి.ప్రతాప్ కుమార్, జగదీష్‌బాబు, కోశాధికారి చదల నాగరాజు, ముఖ్య సలహాదారు వీఎస్వీ రమణారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన గురువారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పారాయణం చేశారు.

విద్యా రంగాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసిందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ విమర్శించారు. హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాలల యాజమాన్యాలు నిలిపివేసిందన్నారు. ఫలితంగా విద్యార్థులు నిరుద్యోగులుగా మారారని, ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల ముందు ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే వారందరికీ రూ.15 వేలు తల్లికి వందనం ఇస్తామన్నారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎగనామం పెట్టారన్నారు. అలాగే జీవో 77 రద్దు చేస్తామంటూ ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయి రాష్ట్ర విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం సంబరాలకు ఇచ్చిన ప్రాధాన్యత విద్యారంగ సమస్యలకు ఇవ్వడం లేదని చెప్పారు. విద్యారంగ సమస్యలపై కేబినెట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్, జిల్లా కార్యదర్శి కార్తీక్, నగర అధ్యక్ష కార్యదర్శులు జగదీష్, రంజిత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాసర్‌జీ

నిరాడంబరుడు కామ్రేడ్ ఏబీ బర్ధన్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మార్క్సిస్ట్ మేధావి, కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు ఏ.బి.బర్ధన్ నిరాడంబర జీవితం గడిపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ ఏబీ బర్ధన్ 9వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కె.రామకృష్ణ బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. బర్ధన్ విద్యార్థి ఉద్యమ నేత నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. కమ్యూనిస్టు పార్టీల ఐక్యత కోసం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని, లంక దుర్గారావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టి రాయప్ప, మూలి సాంబశివరావు, కె.వి.భాస్కరరావు, పంచదార్ల దుర్గాంబ, అప్పరబోతు రాము, కొట్టు రమణారావు, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటసుబ్బయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జాన్సన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్, ఎం.సాయి కుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకునేలా రాణించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే పోటీ పరీక్షలలో రాణిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా విద్యార్థులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని శాసనమండలి సభ్యుడు దువ్వారపు రామారావు పిలుపునిచ్చారు. కేఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. వ్యాసరచన పోటీలలో రాణించిన విద్యార్థులను అభినందించి వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు, ఉపాధ్యాయులు మల్లేశ్వరి, సాధిక తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

బీసీ నేతలతో సమావేశం

బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బీసీ నేతలతో దువ్వారపు రామారావు సమావేశమయ్యారు. బీసీ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు ఎన్వీ రావు, ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయ్, బీసీ ఐక్యవేదిక కార్యదర్శి బాయన శేఖర్‌బాబుతో పాటు పలువురు బీసీ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. బీసీల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలతో పాటు రాజకీయంగా, సామాజికంగా మరింత అభివృద్ధి చెందాలని రామారావు కోరారు.

అథ్లెట్ జ్యోతి యర్రాజీకి అభినందనల వెల్లువ

విజయవాడస్పోర్ట్స్: జీవితంలో ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొని ప్రపంచం గర్వించదగ్గ అథ్లెట్‌గా రాణించి, భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన అర్జున అవార్డుకు ఎంపికైన జ్యోతి యర్రాజీని క్రీడా లోకం ప్రశంశలతో ముంచెత్తుతోంది. తాజాగా కేంద్రం ప్రకటించిన అర్జున అవార్డుల జాబితాలో రాష్ట్ర క్రీడాకారిణి జ్యోతి యర్రాజీ పేరు ఉండటం పట్ల రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు సంతోషం వ్యక్తం వ్యక్తం చేస్తూ ఆమెకు గురువారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. చిన్ననాటి నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొని మొక్కవోని దీక్షతో అథ్లెట్‌గా రాణించిన జ్యోతి ప్రతిభను భారత అథ్లెటిక్ సమాఖ్య సంయుక్త కార్యదర్శి ఆకుల రాఘవేంద్రరావు, సమాఖ్య సభ్యురాలు, ఏపీ సంఘం మాజీ కార్యదర్శి హైమా అభినందనలు తెలిపారు. 100 మీటర్ల హార్డిల్స్‌ను 12.78 సెకన్లలో, 60 మీటర్ల హార్డిల్స్‌ను 8.12 సెకన్లలో పూర్తి చేసిన జాతీయ రికార్డును జ్యోతి సొంతం చేసుకుందని, 13 అతర్జాతీయ పతకాలు, 22 జాతీయ పతకాలు సాధించిందని గుర్తు చేశారు. ఆమె తండ్రి సూర్యానారాయణ సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తుంటారని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో కఠినమైన శిక్షణ తీసుకుని ప్రపంచ అథ్లెట్‌గా రాణించిన ఆమె ఆశయాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.



జ్యోతి యర్రాజీని అభినందిస్తున్న ఆకుల రాఘవేంద్రరావు, హైమ

నో హెల్మెట్...నో ఎంట్రీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ''నో హెల్మెట్...నో ఎంట్రీ'' నినాదంతో ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రజల భద్రత, ప్రాణ రక్షణ దృష్ట్యా ట్రాఫిక్ నిబంధనలు, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో హెల్మెట్ లేని వాహనచోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించటంతో పాటుగా చలానాలు విధిస్తున్నామన్నారు. వన్‌టౌన్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని సీతమ్మవారి పాదాల వద్ద పోలీసులు గురువారం సాయంత్రం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా బ్యారేజీ వైపు వెళ్లే వాహన చోదకులలో హెల్మెట్ లేని వారిని ఆపి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. పత్రాలను పరిశీలించి జరిమానాలను విధించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు నిబంధనల కోసం కాకుండా రక్షణ కోసం హెల్మెట్ ధరించాలన్నారు. చాలా ప్రమాదాల్లో మరణాలు కేవలం హెల్మెట్ లేకపోవటం వలనే జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, సీఐ ఉమామహేశ్వరరావు, ఆర్ఎస్ఐలు శ్రీధర్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణ వీధిలో దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రీతికరమైన ధనుర్మాసం, స్వామి వారి శ్రవణా నక్షత్రం రావటంతో విశేషంగా భావించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో కల్యాణవేదికపైకి తీసుకువచ్చారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞోపవీత ధారణ, జీలకర్ర బెల్లం ధారణ, మాంగల్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామి వారి కల్యాణోత్సవం

వైభవంగా తిరుమంజనం

స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.